


మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను అభిమానంతో ఎత్తుకున్న స్థానికులు, పార్టీ నేతలు

## స్పెషల్ బస్సుల పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తుండ్రు..



సంక్రాంతి స్పెషల్ అంటూ హైదరా బాద్‌కు నడిపించే బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. టికెట్ తీసు కొని కూడా దూరప్రాంతాలకు నిలబడి పోవాల్సి వస్తుంది. అదనంగా ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే ఉన్నతాధికారులు ఆదేశాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. మహిళలకు ఫ్రీ బస్సు పెట్టినా సరిపడా బస్సుల సంఖ్య పెంచలే. టికెట్టుతో ప్రయాణించే పురుషులకు బస్సు ప్రయాణం నరకంగా మారింది. ఎప్పుడు ఏ బస్సు ఎక్కినా నిలబడి ప్రయాణించాల్సి వస్తుంది.

– రాజాగౌడ్, ప్రయాణికుడు



నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కేందుకు ఎగబడిన ప్రయాణికులు

# స్పెషల్ బాదుడు

- సంక్రాంతి ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు
- బస్సులేమో పల్లెవెలుగు.. ఎక్స్‌ప్రెస్ చార్జీ వసూలు
- కొన్ని స్పెషల్ బస్సుల్లో మహాలక్ష్మికి మంగళం
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

నాగర్‌కర్నూల్, జనవరి 11: పండుగ పూట ప్రయాణం భారమైంది. సంక్రాంతి పండుగకు సొంత ఊర్లు, ఇతర ప్రాంతాలకు ప్రయాణించే వారిపై ఆర్టీసీ భారం మోపుతున్నది. స్పెషల్ బస్సుల పేరిట పల్లె వెలుగు బస్సులకు పట్నం బోర్డులు తగిలించి అధిక చార్జీలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. అధిక చార్జీలు పెట్టి కూడా దూర ప్రాంతాలకు నిలబడి పోవాల్సి వస్తుందని పురుష ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహాలక్ష్మి పథకంతో ప్రయాణ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. తెలంగాణలోనే అతిపెద్ద రవాణా వ్యవస్థ అయిన ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రవేశపెట్టి అబాసు పాలవుతున్నది. మహిళలకు ఉచిత ప్రయాణానికి అవసరమైన మేరకు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికుల సంఖ్య 70శాతం పెరిగింది. అందుకు అనుగుణంగా బస్సులను సైతం పెంచాల్సిన ఆర్టీసీ అధికారులు పట్టించుకోకుండా ఉన్న బస్సులనే నడిపిస్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో సీట్లు కోసం మహిళలు సిగపట్లు పట్టుకుంటున్న విషయం తెలిసిందే. జిల్లాలోని ఆయా డిపోల పరిధిలో బస్సుల సంఖ్య పెంచాల్సిన ఆర్టీసీ అధికారులు ఉన్న బస్సులను కుదించడంతో రాత్రి వేళల్లో గమ్యానికి చేరుకునే దాకా ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని డిపోల పరిధిలో స్పెషల్ బోర్డులు వేసుకొని మహిళలను సైతం బస్సుల్లో ఎక్కించుకోవడం లేదని తెలుస్తోంది. గంటల తరబడి ఎదురు చూసిన మహిళలకు స్పెషల్ బస్సుల్లో చుక్కెదురవుతోంది.

### పల్లె వెలుగు బస్సులకు పట్నం బోర్డులు

నాగర్‌కర్నూల్ జిల్లాలోని డిపోల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులకు పట్నం బోర్డులు వేసి పురుష ప్రయాణికుల నుంచి అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట డిపోల నుంచి నడిపిస్తున్న కొన్ని పల్లె వెలుగు బస్సులకు దూర ప్రాంతాల బోర్డులు వేసి స్పెషల్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పల్లె వెలుగు బస్సులను హైదరాబాద్, గచ్చిబౌలి ప్రాంతాలకు నడుపుతూ పురుష ప్రయాణికులతో అధికంగా వసూళ్లు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచే తమకు ఆదేశాలు ఉన్నాయంటూ దబాయిస్తున్నారు. సంక్రాంతి పండుగకు హైదరాబాద్ వంటి పట్టణాల నుంచి పెద్ద సంఖ్యలో పల్లెలకు ప్రయాణికులు వచ్చే అవకాశం ఉండడంతో ఇదే అదనుగా భావించిన ఆర్టీసీ అధికారులు రెగ్యులర్‌గా నడిపించే బస్సులకే దర్జాగా సంక్రాంతి స్పెషల్ బోర్డులు వేసి అధిక చార్జీలను వసూలు చేస్తున్నారు. శనివారం నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో కొల్లాపూర్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు కండక్టర్‌తో ప్రయాణికులు ఘర్షణకు దిగారు. కొల్లాపూర్ డిపో నుంచి సంక్రాంతి స్పెషల్‌గా ఎక్స్‌ప్రెస్ బోర్డుతో వచ్చిన టీఎస్ 09జెడ్ 8101 నెంబర్ గల బస్సు ఉదయం 6:30గంటల సమయంలో నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నది. ఈక్రమంలో నాగర్‌కర్నూల్‌లో ఆ బస్సు ఎక్కిన పురుష ప్రయాణికులతో కండక్టర్ టికెట్ ఇచ్చి అధికంగా వసూలు చేశాడు. దీంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకున్నది. నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు రూ.180 కాగా నాగర్‌కర్నూల్ ఎక్కిన ప్రయాణికుల నుంచి అదనంగా రూ.110 వసూలు చేసి రూ.290 టికెట్ ఇస్తుండడంతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. డిపో మేనేజర్‌కు ఫోన్ చేసినా సరైన సమాధానం రాకపోవడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. బస్సు ఎదుట నిరసనకు దిగారు. ఈఘర్షణ జరుగుతుండగానే నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన టీజీ 31జెడ్ 0029 అనే పల్లెవెలుగు బస్సు పట్నం(గచ్చిబౌలి) బోర్డుతో బస్టాండ్‌కు చేరుకున్నది. ఈ బస్సును చూసిన కొందరు ప్రయాణికులు ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని చంకలు గుద్దుకునే ప్రభుత్వం పల్లెలకు నడిపించాల్సిన పల్లెవెలుగు బస్సును పట్నం బోర్డు వేసి హైదరాబాద్ నడుపుతుందని విమర్శించడం కనిపించింది.



కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు రూ.100 అదనంగా వసూలు చేసినట్లు ఇచ్చిన టికెట్

## ప్రజల గుండెల్లో.. నా స్థానం పదిలం

- బ్యానర్లు చించితే ఒరిగేదేం లేదు.. పైశాచిక ఆనందం తప్పా
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 11: ప్రజల గుండెలో సుస్థిరస్థానం సంపాదించిన వ్యక్తుల పేర్లను బ్యానర్‌లో చించి పైశాచిక ఆనందం పొందుతారే తప్పా.. ప్రజల గుండెల్లో నుంచి తన పేరును అంత ఈజీగా తొలగించలేరని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో వడ్డెర సంఘం నాయకులు ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. అయితే వడ్డెర సంఘం నాయకులు విగ్రహావిష్కరణ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కొందరు ఓర్వలేక శ్రీనివాస్‌గౌడ్ ఫొటోను బ్యానర్‌లో నుంచి చించివేశారు. ఈ విషయాన్ని గమనించిన బీఆర్‌ఎస్ నాయకులు మాజీ మంత్రి దృష్టికి తీసుకురాగా.. పైవిధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన శిల్పారామం, ట్యాంక్‌బండ్, రోడ్లు, వెయ్యి పడకల దవాఖాన, అభివృద్ధి పనులు ప్రజలకు కనిపిస్తున్నాయని, పైశాచిక ఆనందం పొందడానికే మీరు ఇలాంటి దుర్బుద్ధి పనులు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని కుల సంఘాలతో పాటు వడ్డెర సంక్షేమ సంఘానికి భవన నిర్మాణానికి స్థలంతో పాటు నిధులను మంజూరు చేశామని గుర్తు చేశారు. స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పాలన్నారు. సమాజ హితం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని, ఓబన్న విగ్రహం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం మంచి పరిణామమని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు శివరాజ్, నాయకులు నర్సింహులు, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



ఓబన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## క్రీడాకారులను ప్రోత్సహించాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



ఈదమ్మబండ తండాలో ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, జనవరి 11 : క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొల్లంపల్లి జీపీ ఈదమ్మతండాలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల వల్ల స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు విజితారెడ్డి, దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీలు వెంకటయ్య గౌడ్, హైజాక్, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్, నాయకులు అంజి, తిర్మల్‌రావు, హన్మంతు, నిరంజన్, నర్సింహ, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

## లోవోల్టేజీ సమస్య తీర్చాలి

- కొల్పూర్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగిన రైతులు

మాగనూరు, జనవరి 11 : విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో వోల్టేజీ సమస్య తీర్చాలని కొల్పూరు, మందిపల్లి, పుంజనూరు, మూడుమాల్, గజ్రం దొడ్డి గ్రామాలకు చెందిన రైతులు శనివారం కొల్పూర్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొల్పూర్ లిఫ్ట్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్ మాట్లాడుతూ మూడునెలలుగా లోవోల్టేజీ సమస్యతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని దీంతో బోర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను కొల్పూర్ లైన్‌మెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోక పోవడంతో ఐదు గ్రామాల రైతులు కలిసి సబ్‌స్టేషన్‌ను ముట్టడి చేసి లైన్‌మెన్‌తో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. విద్యుత్ కోతలను అరికట్టి సక్రమంగా సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కొల్పూర్ లైన్‌మెన్ మన్యం శెట్టిని వివరణ కోరగా గతేడాది నుంచి సబ్‌స్టేషన్ మెయింటనెన్స్‌కు నోచుకోవడం లేదని దీంతో సబ్‌స్టేషన్‌లో లూజ్ కనెక్షన్స్‌తో ఏర్పడి స్పార్కింగ్స్ రావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఇదే విషయంపై మాగనూరు మండల విద్యుత్ అధికారిని వివరణ కోరగా కొల్పూరు సబ్‌స్టేషన్ అంతా బాగానే ఉందని ఏదో చిన్న పొరపాటు వల్ల సమస్యలు వస్తున్నాయని అవి కూడా త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు.



కొల్పూర్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌తో వాగ్వాదానికి దిగిన రైతులు


## ప్రయాణికులకు చుక్కలు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 11 : మహబూబ్‌నగర్ రీజినల్ పరిధిలోని ప్రయాణికులకు ఆర్టీసీ సంస్థ శనివారం చుక్కలు చూపించింది. సంక్రాంతి పండగ సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. బస్సులు లేక ప్రయాణికులు పిల్ల పాపలతో పడిగాపులు కాస్తున్నారు. మహబూబ్‌నగర్ నుంచి వివిధ రూట్లో ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ బస్సులను రెగ్యులర్‌తో పాటు ప్రతేక బస్సులను నడిపిస్తున్నది. ప్రత్యేక బస్సులకు టికెట్ చార్జీలు ఒక్కసారిగా 50శాతం పెంచేసింది. సూపర్‌లగ్జరి, గరుడ బస్సులకు ఆన్‌లైన్ చెల్లింపుల్లో ప్రతి టికెట్‌పై అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బర్కత్‌పుర డిపోకు చెందిన బస్సులో ప్రయాణికులు కండక్టర్ అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని వాగ్వాదానికి దిగారు. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట్, రాయిచూర్ రూట్లో ఎక్కువగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు కిక్కిరిసి వెళ్తున్నారు. ప్రధానంగా కోస్గి, షాద్‌నగర్, నవాబ్‌పేట్ వంటి పట్టణాలకు బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కనీసం ఐదారు గంటలు బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తుంది.

### స్పెషల్ బస్సులకు అదనపు చార్జీలు..

హైదరాబాద్ డిపో నుంచి వచ్చే స్పెషల్ బస్సులకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్న మాట వాస్తవమేనన్నారు. ఇతర డిపో నుంచి వచ్చే బస్సులు ప్రయాణికులతో నిండుగా వచ్చి తిరిగి వెళ్లేటప్పుడు ప్రయాణికులు తక్కువగా ఉండటం వల్ల అదనపు చార్జీలు వసూలు చేస్తున్నామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఇలానే ఉంటుందన్నారు. రెగ్యులర్ బస్సుకు మాత్రం పాత చార్జీలే వసూలు చేస్తున్నామన్నారు. బస్సులకు ఎలాంటి కొరత లేదని జడ్చర్ల, బాలానగర్ వద్ద ట్రాఫిక్ జామ్ అవ్వడంతో ఉదయం నుంచి మహబూబ్‌నగర్, హైదరాబాద్ రూట్లో బస్సులు కొంత ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు.

– సంతోష్‌కుమార్, ఆర్‌ఎం, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

## హైవేపై బారులుదీరిన వాహనాలు



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు



అడ్డాకుల టోల్‌ప్లాజా వద్ద నిలిచిపోయిన వాహనాలు

అలంపూరు చౌరస్తా , జనవరి 11: సంక్రాంతి పండుగకు సెలవులు రావడంతో జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద శనివారం సుమారు 3కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. శని, ఆదివారం రెండు రోజులు సెలవులు రావడంతో అధిక సంఖ్యలో ఏపీ , కర్ణాటక రాష్ట్రాలకు ప్రజలు తరలివెళ్లారు. టోల్ ప్లాజా వద్ద టోల్ మిషన్లు సరిగా పనిచేయక పోవడంతో మాన్యువల్‌గా పంపాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

### అడ్డాకుల టోల్‌ప్లాజా వద్ద..

మూసాపేట, జనవరి 11 : సంక్రాంతి సందడి రెండు రోజుల ముందుగానే మొదలైంది. హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్లే రోడ్డు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్‌తో బిజిగా మారింది. సంక్రాంతి పండుగకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు జిల్లాలోని గ్రామాలకు వెళ్లే ప్రజలు సొంత వాహనాలతో పాటు బస్సులు, ఆటోలు, జీపుల్లో తరలివెళ్లడంతో జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ జామ్ అవుతూ వచ్చింది. అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద రద్దీ పెరగడంతో భారీగా వాహనాలు నిలిచి పోయాయి.

## బాలుడి కిడ్నాప్ కలకలం

- పిల్లలుకారనే ఉద్దేశంతో అపహరించిన నిందితుడు
- 48గంటల్లో ఛేదించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడి



తండ్రితో బాలుడు

మహబూబ్‌నగర్, జనవరి 11 : మూడేండ్ల బాలుడిని వరుసకు మామ అయిన వ్యక్తి మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. తన కుమారుడిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని గురువారం తండ్రి పాత్లావత్ లాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి 48గంటల్లో బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. జడ్చర్ల మండలంలోని కొత్తతండాకు చెందిన పాత్లావత్ లాలు భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి మహబూబ్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో నివాసం ఉంటున్నాడు. అయితే వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలం తిరుమలయాపల్లి గ్రామానికి చెందిన సభావత్ రాజు లాలుకి మేనత్త కుమారుడు. కొన్ని రోజులుగా లాలు రెండో కుమారుడు మూడేండ్ల విక్కీని ప్రేమగా చూసుకుంటూ రోజూ చాక్లెట్ ఇప్పిస్తూ మభ్య పెట్టేవాడు. ఈ క్రమంలో రాజు బుధవారం లాలు భార్య వద్ద స్కూటీ తాళం తీసుకొని పని ఉందని చెప్పి అంగన్‌వాడీ స్కూల్ వద్దకు వెళ్లి విక్కీని స్కూటీపై ఎక్కించుకొని బట్టలు ఇప్పిస్తాను అని చెప్పి జడ్చర్లకు తీసుకెళ్లాడు. అక్కడ సావిత్రి అనే మహిళను బస్టాండ్‌లో కలిసి ఆమెకు విషయం చెప్పకుండా తన వెంట రమ్మని బండిపై ఎక్కించుకొని వెళ్లారు. అయితే బాధితులకు రాజుపై అనుమానం రావడంతో పోలీసులకు అతడి సెల్‌ఫోన్ లోకేషన్ ద్వారా విజయవాడలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి బాబుతో సహా రాజును మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చారు. పోలీసుల విచారణలో నిందితుడు తనకు లైంగిక వాంఛలు లేక పోవడంతో పెండ్లి చేసుకోలేనని, పెండ్లి చేసుకున్నా పిల్లలు పుట్టారని భావించి బాబును పెంచుకోవాలని కిడ్నాప్ చేశానని తెలిపాడు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేధించిన ఎస్సై విజయ్ కుమార్, పోలీసు సిబ్బంది డీఎస్పీ అభినందించారు.



కిడ్నాప్ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



అదనపు చార్జీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

## ప్రయాణికుల ఆగ్రహం

- అధిక చార్జీలు వసూలు చేస్తున్నారంటూ వాగ్వాదం

కొల్లాపూర్ రూరల్, జనవరి 11 : సంక్రాంతి పండుగ పూట ప్రయాణికులపై ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సుల పేరిట అధిక చార్జీలు వసూళ్లు చేసి భారం మోపుతున్నారు. దీనిపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌నుంచి కొల్లాపూర్‌కు, కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు వచ్చే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులకు చార్జీలు రూ.260 ఉండగా ప్రస్తుతం పండుగ స్పెషల్ బస్సుల పేరుతో అదనంగా రూ.100 ఆర్టీసీ అధికారులు వసూలు చేయడం ఎందుకు అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. శనివారం కొల్లాపూర్ నుంచి హైదరాబాద్ బయలుదేరిన ఆర్టీసీ బస్సు కొల్లాపూర్ దాటిన తర్వాత కండక్టర్ ప్రయాణికులతో అదనపు చార్జీలు వసూలు చేయడంతో అతడితో ప్రయాణికులు వాగ్వివాదానికి దిగారు.